


# సవతి బిడ్డలు

మధురాంతకం రాజారాం

కాలేజీనుంచి నేను నా గదికి చేరుకునేటప్పటికి అయిదు గంటలవుతుంది. ఉదయం పొద్దుంగా కి తీసుకెళ్లింది పోష, సత్తుపాత్రలో మిగిలిన అన్నాన్ని ఏ చారుతోనో మజ్జిగతోనో కలుపుకు తింటాము. మిగిలింది కడుపుకు నీళ్లుపట్టిస్తాను. ఆత్మారాముడు తేరుకుంటాడు. అప్పటికి ముఖం కడుక్కుని తల దువ్వుకునేసరికల్లా వెంకటేసు హాజరైపోతాడు. ఇద్దరం కలిసి ఊరి బయటకు షికారు వెళ్తాము. ఈ రివాజు దాదాపొక సంవత్సరంపైగా కొనసాగింది.

దారిలో వెళ్తూ అడుగుతాను — "ఈ రోజు హాస్టల్లో ఏం చేశారు?" అని.

"ఏముండీ! ముల్లంగి సాంబారు, అరటికాయ వేపుడు, అప్పళం. మజ్జిగ" అంటూ నాలుక చప్పరించేస్తాడు వెంకటేసు.

నాకు నోట్లో నీళ్లూరుతుంది. నాగదిలో నేను ఉడికించుకు తినేది చవీసారంలేని చప్పిడి తిండి. ఆ మాట పైకి చెప్పను. నాలో నేనే గుక్కిళ్ళు మింగుతాను.

అంతటితో వెంకటేసు ఊరుకోడు. 'మవ్వేమైనా అనుకో వోయ్ శేఖరం! ఊరి బిండితో ఒక ముద్ద సంగటి తినిలేస్తే దాని తీరే వేరు. చప్పిడి కూటి మెతుకులకంటే జొన్న రెండు నములడమే నయం!" అంటాడు.

వెంకటేసులో దాపరికాలు లేవు. అతణ్ణి చూచి నేను సిగ్గుపడే వాణ్ణి.

కాలేజీలో చేరిన సంవత్సరం సంక్రాంతి సెలవుల్లో నసుకుంటూను ఊరికి వెళ్ళి తిరిగొస్తూవుండగా రైలుప్రయాణంలో వెంకటేసు నాకు తారసిల్లాడు. క్రాసింగు వుండడం వల్ల బండి ఒక చిన్న స్టేషన్ లో ఆగింది. బుసు పోక కోసం ప్లాట్ఫారం పైన తిరుగుతుండగా ఓ కంపార్టుమెంటులో కిటికీదగ్గర తెలిసిన ముఖమేదో కనిపించినట్టు తోచింది. ఆగాను. ఆతడే పలకరించాడు.

"మీరు తెలుగు కదండీ! తెలుగు డిపార్టుమెంటు వైపు వెళ్తుండగా చాలాసార్లు చూశాను. నేను ఎకనమిక్సు..."

పలుకుదోడు దొరికిందిగదా అని నేను నా లగేజి గూడా ఆ కంపార్టుమెంటులోకే తెచ్చుకున్నాను.

"ఎక్కడినుంచొస్తున్నారు?"

పరిచయం కొనసాగింది. మా వూరు, నా పేరూ చెప్పుకున్నాక అతడు తన గురించి చెప్పుకోవలసి వచ్చింది.

"మొలకవేముల స్టేషన్లో రాయవరానికి మూడు మైళ్ళుంటుంది. సగందూరం డొంకరోడ్డు. అక్కడ మలుపు తిరిగి సగం దూరం డొంకదారిలో నడవాలి. రెండు వందలదాకా ఇళ్ళుంటాయి. అందరూ రైతులే. రాయవరం చెరువు గురించి మీరు బహుశా వినే వుండొచ్చు. నిండితే సముద్రంలా వుంటుంది...."

"ఆ చెరువుకింద మీకు భూములున్నాయా?" యథాలాపంగా నేను ప్రశ్నించాను.

వెంకటేసు నవ్వాడు— "మునుపటి కొకావిడ ఆయమ్మంటే మంగలెందుకని వాపోయిందట! భూములున్నాయా అని మీరు నన్నడగడం అలా వుంది. 'ఈ దేశం నాది!' అని చెప్పితే 'దేశంలో యిదినాది' అని చెప్పుకోడానికేదీ లేనివాళ్ళు చాలామంది వున్నారు. అలాంటి వాళ్ళం మేము. అందుకు మేము ఇళ్ళు కట్టుకున్న జాగా అయినా మాదవునో కాదో సందేహమే! అంతెందుకు, ఇందాకా మా వూరు రాయవరం అన్నాను కాదూ, అది గూడా తమాటే! దూరంగా విసిరివేయబడినట్టు ఊరి శివారుకొక ఫర్లాంగు దూరంలో నలభై యాభై పూరికొట్టాలు, గుడిసెలూ కనిపిస్తాయి. ప్రత్యేకించి దానికొక పేరంటూ లేదు. రాయవరం దగ్గరుంటుంది గనుక రాయవరం మాలపల్లె అనే వాడుక పూర్వం. ఇప్పుడన్ని రంగాల్లో మా నాజూకు తనం ముదిరిపోయింది గదా? ఇప్పుడు రాయవరం హరిజన వాడ అంటున్నారు. పేరు మాత్రం మారింది."

నేను నివ్వెరపడిపోయి రెప్పలార్పకుండా వెంకటేసువైపు చూస్తూవుండిపోయాను. అందుకు కారణాలనేకం. తోడి విద్యార్థి ఒకడను తోడుగా దొరికాడు గనుక మా పసంగం అత్యంత సహజంగా సినిమా విషయాలపైకి మళ్ళుతుందని నేననుకున్నాను. అది గాకపోతే మా కాలేజీ లెక్చరర్లగురించి హీనంగా, తృణీకారంగా, ఎగతాళిగా మాట్లాడుకోడం జరిగినా జరగవచ్చు ననుకున్నాను. ఒక చిన్న కుర్రాడు రంగంలోకి వెళ్ళి పెద్ద గారడీ పని ఒకటి చేసి చూపిస్తే ఎలా వుంటుంది? ఒక కాలేజి స్టూడెంటు సమాజ స్వరూపాన్ని విశ్లేషించి చూడడానికి, చెప్పడానికి ప్రయత్నించడం నాకలాంటిదిగానే తోచింది. అదలా వుంచండి. కొంచెం చీకరి గాకిరిగా వున్నట్టయితే కన్నతల్లిని సైతం 'తల్లి'గా చెప్పుకోడానికి నేను కాడే నాగరిక ప్రపంచంలో విద్యావంతుడైన ఒక యువకుడు తన లేమిని గురించి, అందుకు ప్రధానంగా కారణభూతమైన తన కులాన్ని గురించి నిస్సంకోచంగా చెప్పుకోడం మాత్రం విడ్డూరం కాదా యేమిటి?

బాహ్య ప్రపంచంలో మనిషికొక పరిగణన తెచ్చిపెట్టే వేష భాషలు రెండింటిలోనూ రెండో దానిలో వెంకటేసు తగు మాత్రం చొరవకలిగి వున్నట్టు నేను గ్రహించాను. వేషాన్ని తగినట్టుగా కుసరించుకోడం అతనికి వీలైనట్టు లేదు, తొడుక్కున్న పాంటు, వేసుకున్న చొక్కా గూడా సాదారకం నూలు బట్టలే, అవి గూడా మాసి ముడతలు పడ్డాయి. అలాంటివే యింకొక రెండు జతల దుస్తులు అతడి చేతి సంచిలో వున్నట్టున్నాయి. తల దుబ్బులా పెరిగింది. వడ గాడ్పుల్లో చాలా దూరం ప్రయాణం చేసి వచ్చిన వాడికి మల్లే అతని ముఖం గూడా వాడి, వడిలి పోయినట్టుగా కనిపిస్తోంది,

నా ఆలోచన సరళిని పసిగట్టినట్టుగా వెంకటేసు యిట్టే సంజాయిషీ ప్రారంభించడం నన్ను మరింతగా ఆశ్చర్యంలో ముంచేసిందనే చెప్పాలి.

"పది రోజులుగా అడివికీ ఇంటికీ తిరిగానేమో, ఇలా తయారై పోయాను. మా అమ్మ కూలికో నాలికో వెళ్ళకపోతే పూట గడవదు. ఆ కూలి పనైనా ప్రతిరోజూ దొరకదు. ఊడిగాలు చేసి చేసి ఉడిగిపోయింది! ఇంత వుడకేసుకోవాలన్నా, నీళ్ళుకాచి పోసుకోవాలన్నా ఇంట్లో కట్టెలుండాలి. అందుకని ఆరు నెల్లకు దిగుల్లేకుండా పని మోపుల కట్టెలు యింటికి చేరవేశాను.... ఈ వేషానికేముందిలెండి! వారం పది రోజులు హాస్టల్లో వున్నానంటే— మళ్ళీ పుంజుకుంటాను అన్నట్టు మిమ్మల్నెప్పుడూ హాస్టల్లో చూసినట్టు లేదే?"

"అబ్బే హాస్టల్లోనా! నేనింటిభోజనమైతేనే తిన్నట్టు. లేకపోతే లేదు. హోటల్లోగానీ, హాస్టల్లోగానీ తిన్నానో ఆరోగ్యం బెడిసికొడుతుంది టౌన్లో రూము తీసుకుని వండుకుంటున్నాను. ఊరినుంచీ పచ్చళ్ళూ ఊరగాయలూ తెచ్చుకుంటాను" అన్నాను.

వినిపించలేదుగానీ నాలో అంతరాత్మ అనేదేదైనా వుంటే అది ఫక్కున నవ్వాల్సిన సందర్భం అది! మానాన్నగారు పల్లెటూరి బడిలో మేష్టరుగారు. ఆయన తననెలసరి బడ్జెట్టులోనుంచీ ఒకవంద రూపాయలు మాత్రం నాకోసమని కేటాయించడానికి—అదీ మాఅమ్మ ఎంతో ప్రాధేయపడిన మీదట ఒప్పుకున్నారు. మీసాలకు సంపెంగ నూనె పూసుకునే మధ్య తరగతి అహంభావం నాచేతనిజం చెప్పనివ్వదు.

చెప్పొచ్చిందేమంటే పట్నంలో మకాములూ, కాలేజిలో చదువులువేరైనప్పటికీ మాస్నేహం మాత్రం నానాటికీ నవలు తొడిగి కొనలు సాచుతూ వచ్చింది. నేతాజీరోడ్డు; ముంగరవారి సందు, పోలీసు గ్రౌండు. అలావెళ్ళిమేము పాత్రలపట్టెడ కెదురుగా మట్టి గుట్టపైన కూచునే వాళ్ళం.

జనంనోళ్ళలో పడ్డంవల్ల "ఫ్యాక్టరీ"కి సిద్ధించిన రూపాంతరం పట్టెడ? పోతపోయడం ద్వారా ఇత్తడితో వివిధ గృహోపకరణాలు తయారుచేయడం అక్కడ ప్రముఖంగా జరిగేపని. గంగాళాలు, రైలు కూజాలు, దీపపు సెమ్మెలు, నీళ్ల లోటాలు, చెవుల అండాలు యింకా చాలా రకాల వస్తువులు వివిధ పరిణామాలతో అక్కడ తయారౌతాయి. పాత్ర సామాన్లను కడుపునిండా పూరించుకున్న లారీలు ఫ్యాక్టరీ నుంచీ బయటికి వెళ్ళి పోతూ మాకెదురయ్యేవి. చుట్టూ ప్రాకారం. విశాలమైన ఆవరణ పెద్దపెద్దచెట్లు, ఆ చెట్ల కొమ్మల్లోనుంచీ కానవచ్చే మంగళూరు పెంకుల కట్టడాలు మట్టి గుట్టపైన కూచుండే ఆ ఫ్యాక్టరీ దృశ్యం చూడముచ్చటగా వుంటుంది. లెక్క తెలియదుగానీ ఆ పట్టెడలో పనిచేసే కార్మికులు బహుశా మూడొందలకు మించేవుండొచ్చు, కాకీషరాయితోనూ, కాకీ అరచొక్కాతోనూ కూడిన

యూనిఫారంతో వాళ్ళు పోలీసు గ్రౌండ్సు కవతల ఫ్యాక్టరీవాళ్ళు తమకు కట్టిపెట్టిన క్వార్టర్స్ వైపు వెళ్తూ సాయంకాలపు షికార్లలో మాకెదురయ్యేవాళ్ళు.

ఒక రోజు నాతోబాటుగా నడుస్తూ వున్న వెంకటేసు "చూచావా శేఖరం!" అంటూ హఠాత్తుగా ఒకచోటఆగిపోయాడు.

కార్మికులు కొందరు ఫాక్టరీలో పని ముగిసిన తర్వాత ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోతున్నారు. అంతకుమించి అక్కడ చూడదగ్గ విశేషమేదీ కనిపించడంలేదు.

"ఏమిటి?" అన్నాను.

"వీళ్ళు తొమ్మిదింటికి పనిలోకొస్తారు లంచ్ టైమ్ పోను ఎంచనుగా ఎనిమిది గంటలు పనిచేస్తారు. 'ఓవర్‌టైమ్' చేస్తే అందుకు అదనంగా ప్రతిఫలం తీసుకుంటారు. మా పల్లెలో మా వాళ్ళకి గొప్పైన అదృష్టానికి, దీనికి ఎంత తేడా! మాలో కొందరు వెట్టిగాళ్ళని వుంటారు. వాళ్ళు "ఆండ్రొకల్స్"లా పుట్టుబానిసలు. విప్రవోయి కొద్దిపాటి పుణ్యకాలం తప్పితే మిగిలినప్పుడంతా వాళ్ళు పనిచేస్తూ వుండవలసిందే! ఎవరిదాకానో ఎందుకు? మాఅమ్మ సంగతే చూడు. ఆమె తెల్లవారుజామున్నే లేచి వెళ్ళి ఓ మోతుబరి ఆసామి పశువుల పాకలో చెత్తతోస్తుంది. పేడను తట్టలకువేసి తీసుకెళ్ళి దిబ్బలో పోస్తుంది పశువుల త్రాగటం కోసమని గార తొట్టి నిండుగ నీళ్ళు తోడుతుంది. ఇంత నౌకరీ చేసినందుకు ఆమెకు దొరికేది ఒక ముంత చద్దినీళ్ళు! ప్రొద్దు పొడిచింది మొదలు ప్రొద్దు గూటో పడేదాకా, పుట్టింది మొదలు చచ్చేదాకా మా వాళ్ళు ఎవరికో ఒకరికి ఏదో ఒక ఊడిగం చేస్తూనే వుంటారు. పని మాత్రమే వాళ్ళది ఫలితం వాళ్ళది కాదు...."

"ఇక్కడైనా పరిస్థితి అదేగదా!" అన్నాను. అతడి వాదంలోని తీవ్రతను తగ్గించాలన్నది నా ప్రయత్నం.

"అలా అంటే ఎదరదు శేఖరం! ఇక్కడ వీళ్ళు చేసే పనికి ఒక పరిమితి వుంది. అందుకు వీలైనంత ఎక్కువ ప్రతిఫలాన్ని పొందుతున్నారు. వీళ్ళు ఒంటికి చింపిరి పేలికలు చుట్టుకొని ఆటవికుల్లా కనిపించడంలేదు. ఎందుకు, వాళ్ళకు అడ్డులేని మట్టి కొంపల్లో జీవించడంలేదు. వీళ్ళకు సెలవులున్నాయి. వైద్యసదుపాయాలున్నాయి. వసతులున్నాయి. మా వాళ్ళకేమున్నాయి? బయటికివెళ్తే బండెడు చాకిరీ వుంటుంది. ఇంటికొస్తే కుండలు ఖాళీగా వుంటాయి. దేశంలో ప్రభుత్వాలు మారినా పల్లెలో కూలి రేట్లు మాత్రం మారవు. అప్పులిస్తారు. ప్రోనోట్లు వ్రాయించుకుంటారు. ఎన్నాళ్ళు కూలీ చేసినా వడ్డీకే దాఖలైపోతుంది. అసలు చెక్కుచెదరదు. వాళ్ళీ వూబినుంచి బయటపడేదెప్పుడు? వేచేసనుకుంటూ వుంటానో తెలుసా శేఖరం! భారత మాతను చల్లని తల్లి అంటారు రత్నగర్భ అంటారు. ఆ మాట నేనొప్పుకుంటాను. అయితే ఈ భారతమాతకు దురదృష్టదేవత అంటూ




ఒక సవతిగూడా వుందని నేను తెలుసుకున్నాను. మేమంతా స్వయానా ఆ సవతితల్లి కన్నబిడ్డలం!"

వెంకటేసును చూచి నేను తొలిసారిగా భయపడిపోయింది. అప్పుడే! ఎందుకు భయపడ్డానో తెలుసుకోవడానికి నాలో నాకే కొంత ఆత్మశోధన అవసరమైపోయింది.

"ఏదెలా వుండాలో అలాగే వుంటుంది. ఏదెలా జరిగిపోవాలో అలాగే జరిగిపోతుంది"— అన్న యదార్థవాదాన్ని జీవిత నౌకకు చుక్కానిగా చేసుకుని, అందినదాన్ని పుచ్చుకుంటూ, అందనిదానిపట్ల ఆశలు త్రుంచుకుంటూ బ్రతుకు వెళ్ళదీయడం కొందరి స్వభావం. నా జీవ లక్షణంగూడా అదే అయి వుండాలి. ఆలోచించేవాళ్ళంటే నాకు గిట్టదు. తీవ్రంగా ఆలోచించే వాళ్ళంటే భయంగూడా! ఆలోచన మనిషికి బద్ధశత్రువని నా ఉద్దేశం. ఎందుకంటారేమో! ఈ ప్రపంచం ఎలా వుంది అన్న ఆలోచన రాకూడదు. కలిగిందిపో, ఇదెందుకిలావుంది అంటూ మరొక ఆలోచన పుట్టుకొస్తుంది అంతటితో ఆగదు ఆ తరువాత దీన్ని మార్చాలంటే ఏం చేయాలి అన్న మరొక ప్రాణసంకటమైన ఆలోచన తలెత్తుతుంది. ఈ దశలో ఆలోచన ఆచరణ క్రింద తర్జుమా అవుతుంది. మనిషి వుద్యమకారుడవుతాడు. ఏ ఉద్యమకారుడి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం? ఉద్యమ రథచక్రాలక్రింద నలిగినజ్జుగుజ్జయిపోవడం తప్పా!

స్నేహితుడిగా నేను వెంకటేసు శ్రేయస్సును కోరేవాణ్ణి. అతడిని పెడదారి నుంచీ మళ్ళించడానికి నేను చేయని ప్రయత్నమంటూ లేదు.

కూడూ గుడ్డా. ఇల్లూ వాకిలీ లాంటి నేలబారు సమస్యలేవీ లేకుండా ప్రేమించుకోడమే ఇతివృత్తంగాగల ప్రణయైక జీవుల్ని గురించి వ్రాయబడిన అందమైన పుస్తకాలు తీసుకొచ్చి యిచ్చి చదవమన్నాను. అలాంటివే కొన్ని సినిమాలు చూపించాను. సహపాఠకుల మధ్య ఎడతెగకుండా జరిగే ఇష్టాగోష్ఠుల్లో పాలు పంచుకుంటాడేమోనని చూచాను. భూమ్యాకర్షణ పరిధిని దాటుకుని

ఏ గ్రహాంతరాల వైపో దూసుకు పోతున్న రోదసీ నౌకలకి భూమండలం పట్ల ధ్యాస ఎందుకని? రకరకవిధాలుగా నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. కానీ ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఎక్కడెక్కడ తిరిగినా మళ్లీ మళ్లీ తన గూటికే చేరుకునే పక్షిలా వెంకటేసు ఆలోచనలన్నీ అతడి పల్లెవైపు. ఆ పల్లె జనంవైపే ఎగిరి పోతూ వచ్చాయి.

వెంకటేసుకిలా కార్యాచరణ సంబంధాన్ని గురించి ఆలోచించడమే ధ్యాసగా పరిణమించిన రోజుల్లో ఒకసారి ఫాక్టరీలో సమ్మె జరిగింది. అందుకు కారణమేమిటో తెలుసుకునేదాకా అతడు ఒంటికాలిపైన నిలిచాడు. అది వేతనాలు, బోనసు, పని కాలంలాంటి ఉద్యోగ సదుపాయాలకు సంబంధించిన గొడవకాదు. ఆత్మగౌరవాన్ని గురించి వచ్చిన తగాదా. ఫాక్టరీ మేనేజర్ ఒక కార్మికుడితో పేచీ పెట్టుకుని 'ఒరేయ్, గిరేయ్' అంటూ ఏకవచన ప్రయోగంతో వ్యవహరించాడట. అందుకతను క్షమాపణ చెప్పి తీరాలన్నారు కార్మికులు. చెప్పకపోతే సమ్మె చేస్తామన్నారు. సమ్మె రెండు రోజులు మాత్రమే సాగింది. మూడో నాటికల్లా మేనేజరు గారికి తిక్క కుదిరింది.

"చూచావా శేఖరం!" అన్నాడు వెంకటేసు.

నేను ఉలిక్కి పడ్డాను.

"ఆత్మగౌరవం యిక్కడ చాలా విలువైన వస్తువనిపిస్తోంది. అది పూచిక పుల్లగానైనా చెల్లకపోవడం నా స్వంత అనుభవం. ఇక్కడొక ఫ్యాక్టరీ కార్మికుడికి జరిగిన మర్యాద ఏదయితే వుందో అది మా పల్లెలో అందరికీ అనుదినమూ జరిగేదే! అయితే మేము దాన్ని ఒక అవమానమనే అనుకోము. కొట్టినా, తిట్టినా కిమ్మనకుండా కుక్కిన పేనులా పడివుండడమే మా వాళ్ళకు చేతనైన విద్య. చిరకాలం నుంచీ అలాగే జరిగింది. మరెంతకాలం యిలాగే జరుగుతుందో తెలియదు."

నాకు కాస్త చిరాకు కలిగిన మాట నిజం! "సరేనయ్యా! అందుకోసమని విచారించి యిప్పుడు మనం చేయగలిగిందేముంది?" అన్నాను.

అయోమయంగా నా వైపు చూస్తూ అడిగాడు వెంకటేసు—"చేయగలిగిందేమీ లేదమకుంటే ఫ్యాక్టరీ కార్మికుల స్థితిగతులు గూడా మాకంటే హీనంగా వుండి వుండేవి. కాదంటావా శేఖరం!"

నేను నిరుత్తరుడినై పోయాను.

ఇంతలో మా కోర్సు పూర్తి కావచ్చింది. పరీక్షలు ముగిశాయి. చదువుల సంరంభంలో నుంచీ బయట పడడంతో సముద్రంలో నుంచీ కొట్టుకొచ్చి ఒడ్డున పడినంత 'రిలీఫ్' కలిగింది. అయితే నా మట్టుకు నాకు ఆ ఆనందం తాత్కాలికమే! రిజల్టు వచ్చేదాకా నరుకుని రైలెక్కేశాక, మా నాన్నగారి ఆర్థిక యిబ్బందులు, జరగవలసి వున్న చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, నా అమ్మ అనారోగ్యం ఇలా ఒక్కొక్కటే జ్ఞప్తికి తెచ్చుకుంటూ నేను దిగులుపడి కూచున్నాను ఇంటికి వెళ్ళిన తర్వాత అక్కడ వున్న చుట్టుముట్టే పరిస్థితుల్ని ఎదుర్కోడానికి నేను సిద్ధంగా లేను. అదే నా నిరుత్సాహానికి కారణం. వెంకటేసులో యిలాంటి నిరుత్సాహపు నీడలేవీ పొడ గట్టడం లేదు....

"వెళ్ళి రావోయ్ శేఖరం! మళ్ళీ ఎప్పుడైనా కలుసుకోక పోము. నేను జాబులు రాస్తే బదులిస్తావు గదూ" అన్నాడు వెంకటేసు, మొలకవేముల స్టేషన్లో ప్లాట్‌ఫారం పైన నిలబడి.

నెల రోజులు వేచి చూచినా వెంకటేసు దగ్గరి నుంచి ఉత్తరం రాలేదు. అప్పుడిక నేను వ్రాసిన ఉత్తరానికి ప్రత్యుత్తరమన్నా లేకపోయింది.

మహాభారతంలో వ్యాస ఘట్టాలున్నట్లుగా జీవితంలో మనిషి యిబ్బందులకు లోనయ్యే సందర్భాలు కొన్ని వున్నాయి అనిపిస్తుంది చదువుకు ఉద్యోగానికి మధ్య ఏర్పడే సంధి దశ అలాంటిది. సమస్త సదుపాయాలనూ, ప్రయోజనాలనూ డబ్బుతో కొనుక్కోడానికి వీలున్న సమాజంలో డబ్బులేనివారి పాలిటికి చదువులు ఉద్యోగాలు, మొదలైనవన్నీ లాటరీలో బహుమతులే! తమ కిష్టమైనది గానీ, లేదా తమకు తగినది గానీ వాళ్ళకు లభించడం గగన కుసుమమే. పరిస్థితి యిదై వుండగా, చదువైపోయింది గదా! ఈ చదువుకే ఉద్యోగంవస్తుంది? ఎప్పుడొస్తుంది? ఎంత జీతమొస్తుంది? అంటూ ముసరుకునే ప్రశ్నలకు జవాబు చెప్పుకోడం నా తరం కాక పోయింది. లోకుల ముఖాన పడలేక చీకటి కొట్టులాంటి చిన్న గదిలో పడివుంటూ నాకు నేనే గృహ నిర్బంధంలాంటి శిక్ష విధించుకున్నాను అయినా అక్కడైనా నిమితంగా కాలం గడపడం కష్టమై పోయింది. "ఏ ఉద్యోగానికైనా అప్లికేషన్ పడేయరాదట్రా శేఖరం!" అంటూ మానాన్నగారు, "ఆవచ్చే ఉద్యోగమేదో త్వరగా వస్తే బాగుండి పోవును! లాక్కొచ్చి, లాక్కొచ్చి మీ నాన్నగారు అలసి పోయారు. నువ్వాదుకోకపోతే యిక బండిని లాగలేరు" అంటూ మా అమ్మ ఆ గదిలోనైనా నాకు ఊపిరి తిరగకుండా ముంత పొగపెట్ట సాగారు. ఈ గొడవలన్నీ భరించలేక నేనొక సారి మా బంధువుల ఊళ్ళన్నీ తిరిగి వచ్చేశాను.

తీరా ఒక రోజున నేను పరీక్షలో పాసైనట్టు పత్రికలో వచ్చిన వర్తమానం ఇంటిల్లిపాదిని ఆనందంలో ముంచి లేవనెత్తింది. నా బాణం దేనికైతే గురిపెట్టానో దానికేవెళ్ళి తగలడం బొత్తిగా కాకతాళీయ మని ఒప్పుకుంటాను. ఎలాగైతేనేమి, ఫస్టు క్లాసొచ్చింది గనుక బ్రతికి పోయాను. ఏక్లాసొచ్చినా ఉద్యోగం ఖాయం గాబట్టి వెంకటేసుకు సెకండ్ క్లాసు రావడం బాధాకరమని పించలేదు.

ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజిలో పేరు రిజిష్టరు చేయించుకోవాలిగదా అనుకోడంలో మళ్ళీ పది పదిహేను రోజులు గడచి పోయాయి. అంతకంటే ముందుగా బయలుదేరలేకపోవడానికి కారణం మానాన్నగారికి జీతాలందక పోవడమే!

ఈసారి విద్యార్థినిగా గాదు, ఉద్యోగాన్వేషినిగా పట్నంలో దిగాను. పెద్దచేంతాడులాంటి "క్యూ"లో యాభై ఆరోవాణ్ణిగా ఆఫీసు రిజిష్టరులో పేరు నమోదు చేయించుకుని రిజిస్ట్రేషన్ కార్డు చేతికి తీసుకునేసరికి ఒంటిగంట కావచ్చింది. అప్పుడిక వీలైనంత తొందరగా హోటల్లోకి వెళ్ళపడాలన్న ఉద్దేశంతో రద్దీగా వున్న రోడ్డును వదిలి పెట్టి అడ్డుదారిగుండా నడుస్తున్నాను. పగటివేళలో ఎప్పుడూ తాళం వేసివుండే ఓకల్బు ఆవరణలోనుంచీ పిలుపు వినిపించింది. తిరిగి చూచాను. చెట్టుక్రింద ఆకారం పైకిలేచి, మెల్లగా నావైపు

కదలిరావడం ప్రారంభించాగానీ, పోల్చుకోలేకపోయాను, గడ్డమూ తలా వేమన్నగారికి మల్లే పెరిగి పోయివున్నాయి కళ్లెక్కడో కంద కాలో చేపల్లా కదులుతున్నాయి.

"ఏమిటిది? ఎందుకిలా తయారయ్యావు? ఏం జరిగింది?"-తెల్లబోతూ ప్రశ్నించాను.

రెండుమూడు రోజులుగా పట్టి టీనీళ్ళతోనూ, ఎండురొట్టెతోనూ గడుపు కొస్తున్నాట్ట! గొంతు విప్పేసరికి అతడెంత నీరసంగా వున్నాడో తెలిసొచ్చింది. ఇద్దరమూ హోటల్‌కివెళ్ళి భోజన కార్యం ముగించేదాకా నేను నా పరామర్శను వాయిదా వేసుకోడం తప్పనిసరై పోయింది.

మళ్ళీ ఆ ఆఫీసర్స్ క్లబ్బు ఆవరణలోకే చేరుకున్నాము.

"ఎన్ని రోజులైంది యిక్కడికి వచ్చి?" నింపాదిగా ప్రారంభించాను.

"అయిదో రోజు. కుండలన్నీ గాలిస్తే మా అమ్మ కూడబెట్టిన డబ్బు పదిహేను రూపాయలు దొరికింది. అందులో సగానికి పైగా రైలు చార్జీల క్రిందే చెల్లిపోయింది. ఎంత తక్కువ తిండితో ఎంత ఎక్కువ కాలం బ్రతకవచ్చునన్న విషయంపైన ప్రయోగం చేస్తున్నాను. ఇదిగో, యిప్పటికి మిగిలిందిదే!"-జేబులో నుంచి ఓ అర్ధరూపాయ నాణెం పైకి తీసి చూపించాడు వెంకటేసు.

కొద్ది క్షణాలదాకా నా నోటమాట పెగల్లేదు. ఆ స్థితిలో నుంచి తేరుకున్నాక "కుండల్ని గాలించానంటున్నావు. మీ అమ్మతో చెప్పి రాలేదేమిటి?" అని అడిగాను.


లేదన్నట్టుగా తల అడ్డంగా ఊపాడు వెంకటేసు. తల వంచుకుని నేలవైపు కాసేపు శూన్యచూపులు చూచిన తర్వాత ఇక చెప్పక తప్పేదేముందన్న నిర్ణయానికి వచ్చినట్టుగా "పారిపోయి వచ్చేశాను" అన్నాడు.

"పారిపోయి వచ్చేశావా? నువ్వు! మీ వూరినుంచి!" నా ఆశ్చర్యానికి అవధుల్లేకపోయింది.

"నిజం శేఖరం! నువ్వు చెబితే నేను వినిపించుకోలేదు. పట్నంలో నేను నేర్చుకొన్న పాఠాలన్నీ అక్కడికి వెళ్ళేసరికి బెడిసి కొట్టేశాయి...."

"అంటే?"

"చదువుకున్నవాడు గదా అని మా వాళ్లకు నా మీద గురి కుదిరింది. నేనూ ఏదైనా చేయాలని కాచుక కూర్చున్నాను గదా! కమీనపు షరతులు కొన్ని నెరవేరక పోయేసరికి సమ్మె అమల్లో పెట్టించేశాను. ఆ మంత్రంతో అక్కడ మామిడికాయలు రాలవని తేలిపోయింది. పని చేయడానికి కూలి జనమున్నారు గదా అని బద్ధకం ఒంట బట్టించుకున్న రాఘవరం, ఉలిక్కిపడ్డట్టుగా లేచి కూచుంటుందని ఎవరనుకున్నారు? బావిలో నుంచి నీళ్లు తోడటానికి పంపు సెట్లున్నాయి. పొలం దున్నుకోడానికి ట్రాక్టర్లున్నాయి. పంచదార ఫ్యాక్టరీ లొచ్చాక చెరకు గానుగాడేపని గూడా తగ్గిపోయింది. యంత్రాలొచ్చాక సేద్యంలో మనిషి పాత్ర తగ్గిపోవడం ఒకటి.




రెండోది లాభసాటి గాదని ఆహారపు పంటలు తగ్గించేశారు. వ్యాపార పంటలో కూలీల అవసరం గూడా తక్కువే! ఇతరుల పైన ఆధార పడకుండా తమ పనులు తాము చేసుకుపోవడం సాధ్యమేనని వాళ్లు నిరూపించేశారు. ఎటొచ్చీ నెల రోజుల పొడగునా కూలీ దొరక్క పోయేసరికి మా పల్లె జనానికే పొట్టమాడే పరిస్థితి ఏర్పడింది."

ఆపైన ఏం జరిగి వుంటుందో ఊహించడం సులువే! ఇతడి నాయకత్వం క్రింద తమకేదో ఉదరింపు చేకూరుతుందని స్వజనం ఆశించి వుంటారు, అలాంటిదేమీ ఒనగూడక పోవడం అటుంచి గుడ్డి కంటికి అంజనం పెడితే ఉన్న కన్నుగూడా పూడిపోయినట్టు వాళ్లు ఘోరమైన నిస్సహాయ పరిస్థితిలో పడిపోయారు. ఇంతటికీ కారకుడైన వెంకటేసు వాళ్ల పాలిటికి శనిదేవత పంపించిన దూతలా తోచి వుంటాడు. ఇతడి ఉనికిని సైతం వాళ్లు కంటగించుకునే పరిస్థితి ఏర్పడి వుంటుంది. పాపం, పారిపోయి రాక వెంకటేసు మరేం చేస్తాడు?

o o o o

ఇందాకా చెప్పింది పదేళ్ల క్రిందటి వర్తమానం. నాలుగైదేళ్ల నిరీక్షణ తర్వాత నాకు ఆర్.టి.సి.లో ఉద్యోగం దొరికింది. కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటులో చిన్న ఉద్యోగిగా ప్రవేశించిన వెంకటేసు ప్రమోషన్లు నందుకుంటూ ఆఫీసరు స్థాయికి పెరిగాడు. "ఏమయ్యా వెంకటేసూ! ఉద్యోగికి దూరభూమి లేదంటారనుకో. ఐనా జన్మభూమిని మరచిపోతే ఎలా? ఎప్పుడైనా మన ప్రాంతం వైపు రాగూడదా?" అని అడుగుతుంటాను. "మా అమ్మగూడా పోయింది గదా! నాకింక అక్కడ పనేముంది?" అంటాడు వెంకటేసు నేను కనిపించగానే అతడొక రోజు సెలవు పెట్టేస్తాడు. ఒకటి రెండు పూటలు విందులు పెట్టించి, ఒకటో రెండో మంచి సినిమాలు కూడా చూపించి, స్టేషనుదాకా వచ్చి రైలెక్కించి వెళ్తాడు. పనిబడి హైదరాబాదు వెళ్లినప్పుడల్లా నేను వెంకటేసును కలుసుకుంటూ వుంటాను ...

✳